సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం । 25 । జూన్ । 2025



ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించండి

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. -8లో



రూ.600 కోట్ల విద్యుత్ బకాయిలు

జిల్లాలో రూ.600 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయని విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ తెలిపారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.7/26.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం 26.4 - 35.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 8.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పంచాయతీరాజ్ ఎస్ఈకి పదోన్నతి

కడప సెవెన్‌రోడ్స్: పంచాయతీరాజ్ జిల్లా పర్యవేక్షక ఇంజనీరుగా పనిచేస్తున్న జీవీ శ్రీనివాసులురెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ ఇంజనీరుగా పదోన్నతి కల్పించింది. ఇందుకు సంబంధించి మంగళవారం జీఓ ఆర్‌టీ నెంబరు 528 జారీ చేసింది. పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్‌శాఖ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తూ ఈనెల 30న రిటైర్ కాబోతున్న ఎస్. కృష్ణారెడ్డి స్థానంలో జీవీ శ్రీనివాసులు రెడ్డిని ప్రభుత్వం నియమించింది.

నేడు నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రపంచ శాంతి కోసం వామపక్షాలు బుధవారం నిరసన చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా వామపక్ష పార్టీల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద వైఖరితో ఇజ్రాయులకు మద్దతుగా ఇరాన్ పై ప్రత్యక్ష యుద్ధానికి దిగడం అంతర్జాతీయ న్యాయ చట్టాలకు పూర్తిగా విరుద్ధమైన వైఖరి అని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిరసిస్తూ, ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆపాలని, దేశవ్యాప్తంగా జూన్ 25వ తేదీ అన్ని రాష్ట్రాలలో, అన్ని జిల్లా కేంద్రాలలో, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, అంతర్జాతీయ న్యాయ చట్టాలు కాపాడాలని, సామ్రాజ్యవాదం నశించాలని తెలియజేస్తూ దేశ ప్రజల నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, బాదుల్లా, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు కే.శ్రీనివాసు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, ఆర్.ఎస్.పి జిల్లా కార్యదర్శి కే.సుబ్బరాయుడు, జిల్లా నాయకులు డి.గోపి, నరసింహరావు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ రాము, ఆర్.ఎం.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రమణయ్య, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి బి.ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏలో 44వ ర్యాంకు



ఢిల్లీలో ర్యాంక్ పత్రం అందుకుంటున్న వెంకటరమణ

లక్కిరెడ్డిపల్లి: మండల పరిధి అనంతపురం పంచాయతీలోని గుడ్లవారిపల్లికి చెందిన గూడె వెంకటరమణ సీఎంఏలో ఆల్ ఇండియా కోటాలో 44వ ర్యాంకు సాధించారు. ఈ విద్యార్థి మంగళవారం ఢిల్లీలో గోల్డ్ మెడల్ అందుకున్నారు. వెంకటరమణ నిరుపేద కుటుంబంలో పుట్టారు. ఐదో తరగతి వరకు లక్కిరెడ్డిపల్లి విశ్వభారతి హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి వరకు, ఇంటర్ గుంటూరు మాస్టర్ మైండ్ కళాశాలలో చదివారు. ఉత్తమ ర్యాంకు సాధించేందుకు తల్లిదండ్రులు సహదేవరెడ్డి, రెడ్డమ్మ, ఉపాధ్యాయుల సహకారం మరువలేనిదని ఆయన అన్నారు. వెంకటరమణ దేశ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

'ఉర్దూ' నేర్చుకోవడానికి దోహదం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రాయచోటి టౌన్: ఉర్దూ భాషను సులభంగా నేర్చుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక డీఈఓ కార్యాలయంలో మంగళవారం 'ఉర్దూ భాషను సులభంగా నేర్చుకోండిలా' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని అజీజియా ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో రచయిత అబ్దుల్ వహీద్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా, త్వరగా నేర్చుకునే విధంగా రూపొందించారని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో రెండవ భాషగా ఉర్దూను ఎంచుకున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. అనంతరం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాస రాజు మాట్లాడుతూ ఉర్దూ భాష నేర్చుకోవడానికి ఇలాంటి పుస్తకాలు ఎంతో అవసరం ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ స్టేట్ కన్వీనర్ షేక్ మహమ్మద్ హషీం, పాలం రాజ, గోపాల్, బాబా ఫకృద్దీన్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మట్టి కొట్టుకుపోవద్దు!

- దేవునికడప చెరువు నుంచి జోరుగా మట్టి తవ్వకాలు
- మట్టిని తరలించవద్దని దేవుని కడపలో స్థానికుల ఆందోళన





దేవునికడప చెరువు కట్టపై ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



టిప్పర్ వాహనదారుడిని నిలదీస్తున్న స్థానిక మహిళ

కడప అగ్రికల్చర్: రోజంతా టిప్పర్ల శబ్దాలే.... రోడ్డంతా గుంతలే.. ఇళ్లంతా దుమ్మూ ధూళీ.. వీళ్ల పోరుకు సస్తాన్నాం.. అంటూ దేవునికడప వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవుని కడపలో చెరువు మట్టిని తరలించొద్దని మంగళవారం ఆందోళన చేశారు. ట్రాక్టర్లతో కాకుండా భారీ వాహనాలతో మట్టిని తరలిస్తున్నారని.. అలా తరలించవద్దని రోడ్డుపై అడ్డంగా నిలబడి నిరసన చేపట్టారు.

కొన్ని రోజులుగా నిబంధనలకు వ్యతిరేకంగా చెరువులో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. మట్టి తరలింపు వాహనల రాకపోకల కారణంగా పాతకడప నుంచి వాటర్ గండికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. భారీ వాహనాలతో మట్టిని తరలించడం వల్ల రోడ్లన్నీ గుంతలు పడటంతోపాటు దుమ్ముధూళంతా ఇళ్లలోకి వస్తోందని స్థానికులు వాపోయారు. దీంతోపాటు దుమ్ముకు దగ్గు, ఆయాసం వస్తోందని బాధ వ్యక్తం చేశారు. వాహనాల తాకిడి, శబ్ధాలతో ఇళ్లలో ఉండలేక పోతున్నామని చెప్పారు. వాహనాల తాకిడికి పిల్లలు పాఠశాలకు పంపాలంటే భయమేస్తోందని.. తమ పిల్లలకు ప్రమాదం పొంచి ఉందని వాపోయారు. దీంతోపాటు ముసలోళ్లు రోడ్లపైన తిరగలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం 20 రోజులుగా జరుగుతోందని, దీన్ని పట్టించుకునే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భారీ వాహనాలు నిత్యం ఆలయం మీదుగానే అధిక సంఖ్యలో వెళ్లుతుండటంతో భక్తులకు ఎంతో అసౌకర్యం కలుగుతుందని తెలిపారు.

పొలాలకు కాదు వెంచర్లకు..

దేవుని కడప మట్టిని పొలాలకు అని చెప్పి అధికారుల వద్ద అనుమతి తోసుకుని వెంచర్లకు తరలిస్తూ వేలకు వేలు దండుకుంటూ వ్యాపారం చేస్తున్నారని స్థానికులు వాపోయారు. అది కూడా ట్రాక్టర్లతో తోలుకుంటామని అనుమతులు తీసుకుని భారీ ట్రిప్పర్లతో రాత్రింబవళ్లు మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుమట్టి తరలింపును ఆపకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని స్థానికులు హెచ్చరించారు. స్థానికుల ఆందోళనకు ఎస్ఎఫ్ఐయూఐ నాయకులు మద్దతిచ్చారు.

వాహనాలతో ఇబ్బందిగా ఉంది



చెరువులో నుంచి భారీ వాహనాలతో మట్టిని తరలించడంతో చాలా ఇబ్బందిగా ఉంది. పెద్దపెద్ద వాహనాలు కావడంతో రోడ్లు పాడవుతున్నాయి. దీంతోపాటు దేవునికడప ఆలయం ఎదుట, మాడవీధుల్లో భారీ వాహనాలు వేగంగా వెళుతుండడంతో భక్తులకు తీవ్ర అసౌకర్యంగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. - జయభారత్‌రెడ్డి, స్థానికులు

పిల్లలను బడికి పంపలేక పోతున్నాం



వాహనాల తాకిడితో పిల్లలను బడికి పంపాలంటే భయం వేస్తోంది. నిత్యం పదుల సంఖ్యలో భారీ భారీ టిప్పర్లు తిరుగుతుండటంతో చిరాగ్గా ఉంది. ఒకటి తరువాత ఒకటి వస్తూనే ఉంటాయి. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. -నాగమణి, స్థానికురాలు

ఆయాసంతో అల్లాడుతున్నాం



పెద్ద వాహనాలు వెళ్తుండటంతో దుమ్మంతా లేస్తోంది. దానిని పీల్చుకుంటూ దగ్గు, ఆయాసంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - వసుందరమ్మ, స్థానికురాలు

అధికారులు స్పందించాలి



చెరువుమట్టి తరలింపులో అధికారులు స్పందించాలి. ట్రాక్టర్లతో కాకుండా భారీభారీ వాహనాలతో మట్టిని తరలిస్తుండటంతో దుమ్మ దూళిలో స్థానికంగా ఉండలేక పోతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - వెంకటక్రిష్ణ, స్థానికులు

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 220 మంది హాజరు



వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న మంగళవారం నాల్గవ రోజు కౌన్సెలింగ్‌కు 220 మంది హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 50001వ ర్యాంకు నుంచి 68 వేల ర్యాంకులకు సంబంధించిన అభ్యర్థులు కౌన్సిలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ధ్రువపత్రాలను పరిశీలించుకున్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ పద్మజ, వెరిఫికేషన్ ఆఫీసర్లు ప్రసాద్, ప్రశాంతి, ప్రసన్నలతోపాటు రాజేష్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌కు...

నేడు నిర్వహించబోయే కౌన్సిలింగ్ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 68001 నుంచి 86 వేల ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు హాజరుకావాలని కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

పర్యాటక వ్యయంపై జాతీయ సర్వే

కడప సెవెన్‌రోడ్స్: దేశీయ పర్యాటక వ్యయం, జాతీయ గృహస్థ ప్రయాణంపై జాతీయ గణాంక శాఖ 80వ విడత సర్వే చేపడుతోంది. ఈ సర్వే ఈ ఏడాది జులై నుంచి వచ్చే ఏడాది జూన్ వరకు కొనసాగనుంది. వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు ఆ శాఖ సహాయ సంచాకులు గంపా శ్రీనివాసరావు తెలిపారు. గృహస్తుల రోజువారి ప్రయాణాలు, వాటిపై ఖర్చు, రవాణా మార్గాలు, వసతులు, ఆహార వసతులు తదితర విషయాలను సర్వేలో తెలుసుకుంటారు. ఇందుకు సంబంధించిన శిక్షణ తరగతులు కడపలో నిర్వహిస్తున్నట్లు సహాయ సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు.

4 నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు



నందలూరులోని సౌమ్యనాథస్వామి ఆలయం

నందలూరు: జిల్లాలో అత్యంత ప్రాశస్త్యం పొందిన ఆలయాలలో ఒకటైన సౌమ్యనాథ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు జూలై 4 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 13వ తేదీ వరకు 10 రోజుల పాటు వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. 4న ఉద యం తిరుమంజనం, రాత్రి అంకురార్పణ, 5న ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాలివాహనం , 6న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హంస వాహనం, 7న ఉదయం పల్లకీ సేవ, రాత్రి సింహవాహనం, 8న ఉదయం పల్లకీసేవ, రాత్రి హనుమంతు వాహనం, 9న ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 10న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు ఉంటాయని తెలిపారు. 11న ఉదయం కల్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 12న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 13న ఉదయం చక్రస్నానం , రాత్రి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

26 నుంచి ఆర్‌బీఎస్‌ఎం సమావేశం

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ సహకారంతో ఈనెల 26,27,28 తేదీల్లో తిరుపతిలో రివర్స్ కొనుగోలు దారులు, అమ్మకం దారుల సమావేశం(ఆర్‌బీఎస్‌ఎం) నిర్వహిస్తున్నట్లు జిల్లా పరి శ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చాంద్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సాహం ఉన్న ఎంఎస్ఎంఈ తయారీ రంగ పరిశ్రమల యాజమాన్యాలు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. వివరాలకు జి.రఘునాథ్‌బాబు (9010 717919), మహేష్ పెసరమల్లి(7842591581) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే పాఠశాలల విలీనం

- విలీనంపై తల్లిదండ్రుల అభిప్రాయాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తాం
- చియ్యపాడు, సిద్దారెడ్డిపల్లె దళితవాసులతో సమావేశమైన డీఈఓ షంషుద్దీన్



చియ్యపాడులోని హరిజనవాడ పాఠశాలలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

చాపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకే పాఠశాలల విలీన ప్రక్రియ జరిగిందని ఈ క్రమంలో చియ్యపాడు, సిద్దారెడ్డిపల్లె గ్రామాల్లోని ఎంపీపీ స్కూల్‌లో గల 3, 4, 5 తరగతులను సమీపంలోని మోడల్ స్కూల్‌లో విలీనం చేశామని జిల్లా విద్యాధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ నుంచి మండలంలోని చియ్యపాడు దళితవాడ, సిద్దారెడ్డిపల్లె గ్రామాల్లోని ఎంపీపీ స్కూల్‌ల విలీనంపై తల్లిదండ్రుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. రెండు గ్రామాల్లోని స్కూల్‌ల నుంచి మోడల్ స్కూల్‌లకు విద్యార్థులను తమ తల్లిదండ్రులు పంపించడం లేదు. ఈ క్రమంలో మంగళవారం జిల్లా విద్యాధికారి షంషుద్దీన్ ఆయా గ్రామాల్లో పర్యటించి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ జీఓ నెంబర్-27 ప్రకారమే విలీనం జరిగిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపమని నిరసన తెలియజేస్తుండటంతో వారితో చర్చిస్తున్నామన్నారు. మోడల్ స్కూల్‌కు విద్యార్థులను పంపడం వల్ల ప్రతి తరగతికి అన్ని రకాల వసతులతో ఒక ఉపాధ్యాయుడు అందుబాటులో ఉంటారన్నారు. నిరసన తెలిపే గ్రామాల్లోని పాఠశాలలను కొనసాగించాలా లేక మోడల్ స్కూల్‌లో విద్యార్థులను విలీనం చేయాలా అనేది విద్యార్థుల చేతుల్లోనే ఉంటుందన్నారు. పాఠశాల కమిటీ, తల్లిదండ్రులతో కలసి సమావేశాన్ని నిర్వహించుకుని నివేదికను తమకు ఇస్తే దీనిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం

పాఠశాల విలీన ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోవాలని యథావిధిగా పాఠశాలలను తమ గ్రామంలోనే కొనసాగించాలని మండలంలోని సిద్దారెడ్డిపల్లెకు చెందిన దళితవాసులు, గ్రామ పెద్దలు మంగళవారం ఎంపీడీఓ వీరకిషోర్, డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

అంతులేని దోపిడీ.. అరికట్టేవారేరీ!

- విద్యాలయాలా... వ్యాపార కేంద్రాలా?
- ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో యథేచ్ఛగా పుస్తక విక్రయాలు
- అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి
- నిద్దురపోతున్న విద్యాశాఖ అధికారలు



కడప నగరంలో ఓ కార్పొరేట్ స్కూల్లో విక్రయిస్తున్న పుస్తకాలు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలో విద్యా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఒకవైపు అధిక ఫీజుల వసూళ్లు, మరోవైపు విద్యాసామగ్రి అమ్మకాల పేరుతో దోపిడీ పర్వం యమ దర్జాగా సాగుతోంది. దీంతో పేద, మధ్య తరగతి తల్లిదండ్రులకు దిమ్మతిరుగుతోంది. దీనికితోడు కొన్ని కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు సొంత సిలబస్ పేరుతో పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు బలవంతంగా అంటగడుతున్నారు. ప్రభుత్వం ముద్రించిన పుస్తకాల ధరలు వందల్లో ఉంటే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ముద్రించిన పుస్తకాల ధరలు మాత్రం వేలల్లో ఉంటున్నాయి. ఇదేమని అడిగేవారే కరువయ్యాయని తల్లిదండ్రుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మా పుస్తకాలే కొనాలి..

కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ సూళ్ల యాజమాన్యాలు తాము ముద్రించిన తమ సిలబస్ పుస్తకాలను మాత్రమే కొనుగోలు చేయాలని ఆర్డర్ వేస్తున్నారు. ఇందులో 1 నుంచి 5వ తరగతి వరకు 5000 నుంచి 6500 వరకు, 6 నుంచి 10వ తరగతి వరకు 6 వేల నుంచి 10 వేలు పైనా వసూలు చేస్తున్నట్లు పలువురు తల్లిదండ్రులు తెలిపారు. ఇక ఇంటర్మీడియట్‌కైతే మరింత ఎక్కువ ఉంటుందని వాపోతున్నారు. దీంతోపాటు నీట్, ఐఐటీ, ఒలంపియాడ్, సీ బ్యాచ్, టెక్నో వంటి పలు రకాల పేర్లతో అదనంగా వసూళ్లు చేస్తున్నారు. ఇదంతా ఆర్థిక భారమైనా.. గత్యంతరం లేక వారు అడిగినంత చెల్లించాల్సి వస్తుందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల బ్రాంచు పుస్తకాలు, యూనిఫాం ఇతర సామగ్రితో వ్యాపార కేంద్రాలుగా దర్శనమిస్తున్నాయి.

అరికట్టేవారే కరువు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యాసామగ్రిని తమ పాఠశాలల్లోనే దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్న విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినా అరికట్టడంలో విఫలమవుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. కొంతమంది తల్లిదండ్రులు స్వయంగా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనికి తోడు విద్యార్థి సంఘాలు కూడా పాఠశాలల వద్ద, డీఈఓ కార్యాలయం, ఆర్‌ఐవో కార్యాలయం వద్ద పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నా స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

గుర్తింపు రద్దు చేయాలి



చాలా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లోనే పుస్తకాలు, విద్యాసామాగ్రి అమ్మకాలు చేస్తున్నా పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో అధికారుల ధోరణి సరికాదు. నిబంధనలు పాటించకుండా అమ్మకాలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. - జయవర్ధన్, అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అధిక ఫీజుల విషయంలో...



జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలలు పలు రకాల ఫీజుల పేరుతో తల్లితండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయంలో ప్రైవేటు, కార్పోరేటు యాజమాన్యలు ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. - సుబ్బరాయుడు, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి

కళాశాలల్లో కూడా...



జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్లో కూడా ఫీజుల దొపిడీ సాగుతోంది. ఈ విషయమై విద్యాశాఖ అధికారులకు పిర్యాదు చేసిన స్పందన లేదు. - అంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నేటి నుంచి మదనపల్లికి గుంటూరు ఎక్స్‌ప్రెస్

కలికిరి: తిరుపతి-గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం నుంచి తిరుపతి నుంచి మదనపల్లి వరకు నడువనుంది. మదనపల్లి నుంచి తిరుపతి వరకు అన్ రిజర్వుడు స్పెషల్ ట్రైన్‌గా నడుపనున్నారు. తిరుపతి నుంచి యథావిధిగా ఎక్స్‌ప్రెస్‌గా నడువనుంది. దీంతో మదనపల్లి నుంచి తిరుపతి వరకు రైలు ప్రయాణికులకు సూపర్ ఫాస్ట్ చార్జీలు అమలులోకి రానున్నాయి. అన్ రిజర్వుడు సూపర్ ఫాస్ట్ (07261) ఉదయం 5.15 గంటలకు తిరుపతిలో బయల్దేరి పాకాలకు 5.55 గంటలకు, పీలేరు 6.25కి, కలికిరి 6.40కి, మదనపల్లికి 8.15 గంటలకు చేరుకుంటుంది. తిరిగి 07261 రైలు మదనపల్లిలో సాయంత్రం 3 గంటలకు బయల్దేరి 3.30కి కలికిరి, పీలేరు 3.45కి, పాకాల 4.50కి, తిరుపతికి సాయంత్రం 6 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి యథావిధిగా గుంటూరు ఎక్స్‌ప్రెస్(17262)గా సాయంత్రం 7.25 గంటలకు బయల్దేరి రేణిగుంట, రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు, కడప జంక్షన్, కమలాపురం, యర్రగుంట్ల జంక్షన్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కోవెలకుంట్ల, బనగానపల్లి, నంద్యాల జంక్షన్, గిద్దలూరు, కంభం, మార్కాపురం రోడ్, దొనకొండ, వినుకొండ, నరసరావుపేట, మీదుగా ఉదయం 7.20 గంటలకు గుంటూరుకు చేరుకుంటుంది.

క్లుప్తంగా

తల్లీబిడ్డలు అదృశ్యం


తన బిడ్డలతో రాజేశ్వరి (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఓ మహిళ తన ఇద్దరు బిడ్డలతో అదృశ్యమైనట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఆయన కథనం మేరకు... రాజేశ్వరి అనే మహిళ తన బిడ్డలైన గురు రాజేశ్వరి, గురు ఈశ్వరితో కలిసి ఈనెల 13వ తేదీన పిల్లలకు స్కూలులో వదిలి పెడతామని చెప్పి వెళ్లిపోయింది. ఆ తర్వాత తిరిగి రాకపోవడంతో ఆమె తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

వల్లూరు : మండల కేంద్రమైన వల్లూరులోని ఎస్సీ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును చోరీ చేశారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఎస్సీ కాలనీకి చెందిన బూసిపాటి శ్యామల తన ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా దుండగులు ప్రహరీ దూకి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కమలాపురం సీఐ ఎస్కే రోషన్, ఎస్ఐ పెద్ద ఓబన్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలాన్ని రప్పించి తనిఖీలు నిర్వహించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతి చెందిన రాచకొండు వెంకటరమణ

కలసపాడు : మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన రాచకొండు వెంకటరమణ (55) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటరమణ గ్రామంలో రెండు ఎకరాల సొంత పొలంతోపాటు 10 ఎకరాలను కౌలుకు తీసుకుని పంటలను సాగు చేశాడు. ఈ క్రమంలో పంటల సాగుకు రూ.18లక్షలు అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చే పరిస్థితి లేక మంగళవారం తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. పోరుమామిళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : స్థానిక నాగరాజుపేటలో ఇద్దరు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. సీఐ రామకృష్ణ ఆదేశాల మేరకు తన బృందంతో నాగరాజుపేట సమీపంలో మట్కా ఆడుతున్న సంజామల మధు, కోడేదుల మాబుసుబాన్‌లను అరెస్టు చేసి రూ. 2850 నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లాలో రూ.600 కోట్ల విద్యుత్ బకాయిలు

విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ


విలేకరులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ, తదితరులు

వేంపల్లె : జిల్లాలో రూ.600 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయని విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ తెలిపారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలు, గృహేతరాలు, వాణిజ్య సముదాయాలు తదితర వాటి నుంచి విద్యుత్ బకాయలు ఉన్నాయన్నారు. అందులో రూ.21 కోట్లు మొండి బకాయిలు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులు సుమారు రూ.700 కోట్లు వసూలు చేశామన్నారు. ప్రతినెలా లో టెన్షన్ విద్యుత్, హై టెన్షన్ విద్యుత్తు సరఫరాకు సంబంధించి దాదాపు రూ.200కోట్లు వసూలు అవుతుందన్నారు. జిల్లాలో 60 విద్యుత్ సబ్ స్టేషన్లు(33/11కేవీ) అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఒక్కొక్క సబ్ స్టేషన్‌కు రూ.5 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి తక్షణమే కనెక్షన్ ఇచ్చేందుకు ఇబ్బందులు లేవన్నారు. ఇంధన సర్దుబాటు చార్జీలవల్ల వినియోగదారులకు అధిక బిల్లులు వస్తాయని, ఈ బిల్లులు 2026 మార్చి వరకు కొనసాగుతాయన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ఏ విధంగా కూడా అధిక బిల్లులు రావన్నారు. ప్రస్తుతం 200 యూనిట్లు పైబడిన వారికి స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నామని, త్వరలోనే ప్రతి ఇంటికి కూడా స్మార్ట్ మీటర్లను బిగించే యోచనలో ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 6.75 లక్షల గృహాలకు మీటర్లు ఉన్నాయని, అంతేకాకుండా పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ సోలార్ బిగించుకోవాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇదివరకే జిల్లా వ్యాప్తంగా 700 గృహాలకు సోలార్ ప్యానల్‌ను బిగించినట్లు తెలిపారు. రెండు నెలల్లో 10వేలు సోలార్ కనెక్షన్లు ఇవ్వాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గృహాలకు సోలార్ కనెక్షన్ బిగించుకోవడం వల్ల 90 శాతం విద్యుత్ ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేంద్ర, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్ కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో ఇచ్చే సోలార్ రూఫ్ టాప్‌కు చెందిన పీఎం సూర్య ఘర్ యోజనను గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రోడ్డు భవనాల శాఖ అతిథి గృహంలో కేజీ సోలార్ సిస్టం ఇంటలేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు పీఎం సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ పవర్ నెట్ మీటరింగ్ సిస్టమ్ ద్వారా కరెంటు బిల్లును 90 శాతం తగ్గించుకోవచ్చునన్నారు. ప్రతి ఇంటి రూఫ్ టాప్ మీద 1 కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60వేలు, 3 కిలో వాట్లకు రూ.78 వేలు,. అలాగే బీసీ కులాలకు చెందిన వారికి అదనంగా 20 శాతం అంటే రూ.98వేల చొప్పున ప్రభుత్వ రాయితీ లభిస్తుందన్నారు. గృహాలపై సోలార్ పలకలు పెట్టుకోవడం వలన విద్యుత్ బిల్లులు నెలకు రూ.400లోపే ఉంటాయన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచడం తగదు

- జులై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం
- నిరసన ప్రదర్శనలో ఎల్ఐసీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి


నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ జులై 9న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక డివిజనల్ కార్యాలయం ఎదుట దేశవ్యాప్త పిలుపు మేరకు జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమం మరోమారు చేపట్టనుందని, దీనిని ప్రతిఘటిస్తున్నామన్నారు. బీమా ప్రీమియంలపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని ఆయన కోరారు. 3,4 తరగతుల సిబ్బంది కోసం రిక్రూట్‌మెంట్ తక్షణం చేపట్టాలన్నారు. దేశంలో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పెన్షన్ విధానానికి స్వస్తి పలికి పాత పెన్షన్ విధానాన్ని అమలుకు సిద్ధపడుతున్నాయని, ఎల్ఐసీలో కూడా అందరికీ పాత పెన్షన్ విధానమే అమలు చేయాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ నేతలు వసుప్రద, వారిజాతమ్మ, కేసీఎస్ రాజు, అమీనా పర్వీన్, రత్న కిషోర్, శ్రీవాణి, శశికళ, కుమార్, రఘు, చిన్నయ్య, గౌస్, హనుమ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి


ప్రమీల (ఫైల్)

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలో మంగళవారం పాము కాటుకు గురై మహిళ మృతి చెందింది. మృతురాలి కుమారుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రిపురంలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న ప్రమీల (57) ఇంటి వద్ద మధ్యాహ్న సమయంలో దుస్తులు ఉతుక్కుంటున్న సమయంలో పెద్ద నాగు పాము ఆమెను కాటేసింది. దీంతో ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు గమనించి హుటాహుటిన ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పులివెందుల తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే ఆమె మృతి చెందింది. అయితే పాము కాటు వేసిన ప్రాంతాన్ని ప్రమీల తెలపడంతో చుట్టుపక్కల వారు ఇటుకలు తొలగించి ఆ పామును చంపివేశారు.

ముంబై-చెన్నై రైలులో దోపిడీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ముంబయి నుంచి చెన్నై వెళుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22159) రైలులో మంగళవారం తెల్లవారుజామున అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కోమలి వద్ద ఎస్1, ఎస్2 కోచ్‌లలో దోపిడీ జరిగింది. కడప రైల్వే సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. తాడిపత్రి సమీపంలోని కోమలి వద్ద దుండగులు సిగ్నల్ వైర్లు కత్తిరించడంతో రైలు ఆగిపోయింది. బోగీల్లోకి దుండగులు చొరబడ్డారు. రైలులో విశాలాక్షి అనే మహిళ డీఎస్సీ పరీక్ష విధుల నిమిత్తం కడపకు వస్తుండగా ఆమె మెడలో ఉన్న 2.7 గ్రాముల బంగారు చైనును దుండగులు లాక్కెళ్లారు. ఈమేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను తిరిగి గుత్తికి వెళ్లి అక్కడ ఫిర్యాదు చేస్తానని రైల్వే పోలీసులకు ఆమె తెలిపారు. ఈ విషయాన్ని తాము గుత్తి పోలీసులకు కూడా సమాచారం అందించామని సీఐ వివరించారు.

స్థల వివాదంలో ఇరు వర్గాలపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఖాదర్‌బాద్‌లో స్థల వివాదానికి సంబంధించి సోమవారం రాత్రి జరిగిన ఘటనలో ఇరువర్గాలపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్ ఖాదర్‌బాద్‌లోని తన స్థలంలో నిర్మాణాలను ప్రారంభించారు. అయితే కౌన్సిలర్ మునీర్ అహ్మద్ నిర్మాణాలపై అభ్యంతరం తెలిపాడు. దీంతో పోలీసుల సూచన మేరకు డాక్యుమెంట్ల ప్రకారం వెళ్లాలని ఇరువురు మాట్లాడుకున్నారు. అయితే సోమవారం రాత్రి తాను నిర్మించుకున్న ప్రహరీని కూలుస్తున్నారని తెలియడంతో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తన ముఖ్య అనుచరులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. అయితే అప్పటికే అక్కడ ఉన్న షరీఫ్, గౌస్, మునీర్ తమ్ముడు బషీర్ అహ్మద్, సుబ్రమణ్యంలతో పాటు మరి కొందరు వారిపై దాడి చేశారు. శేఖర్ యాదవ్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రాజు తెలిపారు. తమ స్థలాన్ని ఆక్రమించుకొని గోడను కడుతున్నందున ఆపమని అడిగినందుకు తమపై దాడి చేశారని షరీఫ్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు శేఖర్ యాదవ్, సందీప్, హేమకుమార్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ముందు జాగ్రత్త చర్యగా ఖాదర్‌బాద్‌లోని ఘటనా స్థలంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన బీసీ నేతలు


మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, శివరామ్

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్, వైఎస్సార్ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు ఎన్. శివరామ్ కలిశారు. మంగళవారం విజయవాడలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి పలు విషయాలను వివరించారు. ముఖ్యంగా జిల్లా బీసీ విభాగం చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్‌లో రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం జిల్లా పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జిల్లా బీసీ విభాగం ఎలా పనిచేస్తుందో విధి విధానాల గురించి వివరించారు. దీనిపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందిస్తూ మీలాంటి వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మోసపూరిత హామీలపై ప్రజల పక్షాన పోరాడాలని సూచించారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎన్ఆర్ఐలు


మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎన్ఆర్ఐలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గల్ఫ్ ఎన్ఆర్ఐలు కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వారు ఆయనను కలిసి ప్రవాసాంధ్రుల సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఉన్న మన తెలుగువారు జాగ్రత్తలు తీసుకోవాలని, భారత ప్రభుత్వ ఆదేశాలను అనుసరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ద్వారా సందేశం ఇవ్వాలని వారికి సూచించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్ ఏ. సాంబశివారెడ్డి, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, కువైట్ ఐటీ ఇన్‌చార్జి షేక్ అఫ్సర్ అలీ, బీసీ సభ్యుడు నరసింహ యాదవ్, మైనార్టీ సభ్యుడు షేక్ నాసర్, ఖతార్ మైనార్టీ ఇన్‌చార్జి షేక్ దర్బార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


కాశినాయన:నరసాపురం జెడ్పీ హైస్కూల్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి

కాశినాయన : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, నరసాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వంటశాల, స్టోర్ రూంను ఆయన పరిశీలించారు. నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ ప్రారంభమైనప్పటి నుంచి స్టాక్ రిజిస్టర్ రాయకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ బాబుకు మెమో ఇచ్చారు. అనంతరం నరసాపురం మోడల్‌పాఠశాలను తనిఖీ చేసి స్కూల్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు విద్యార్థులకు గుడ్లు ఇవ్వలేదని తెలుసుకుని ప్రిన్సిపాల్ సౌజన్యను ప్రశ్నించారు.

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో టిఫెన్ మెనూలో మార్పులు ఉంటాయన్నారు.

గురుకుల హాస్టల్ టెండర్లలో ఉద్రిక్తత

- కలెక్టరేట్‌లోనే బాహాబాహీకి యత్నం
- పోలీసు బందోబస్తు ఏర్పాటు


జేసీ కార్యాలయంలో టెండరు బాక్సు వద్ద పోలీసు బందోబస్తు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని గురుకుల పాఠశాల హాస్టళ్లకు సరుకులు సరఫరా చేసే టెండర్ల దాఖలు విషయంలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కడప, వేంపల్లె, మైలవరం గురుకులాల హాస్టళ్లకు కోడిగుడ్లు, చికెన్, పాలు, కూరగాయలు, అరటిపండ్లు తదితర సరుకులు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. జాయింట్ కలెక్టర్ చాంబర్ వద్ద టెండరు బాక్సును ఏర్పాటు చేశారు. టెండర్ల దాఖలుకు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు తుది గడువు విధించారు. దీంతో అధికార పార్టీకి చెందిన మండల, గ్రామ స్థాయి నాయకులు టెండరు దాఖలు చేసేందుకు వచ్చారు. మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గం వనిపెంటకు చెందిన కొందరు కడపకు సంబంధించి టెండరు దాఖలు చేసేందుకు వచ్చారు. దీనికి కమలాపురం ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నాయకులు అడ్డు తగిలారు. తాము మైదుకూరు నియోజకవర్గానికి సంబంధించిన టెండర్లు దాఖలు చేయలేదు గనుక మీరు కూడా కడపకు సంబంధించి టెండరు వేయవద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరెవరి నియోజకవర్గాల పరిధిలో వారు టెండర్లు దాఖలు చేసుకోవాలంటూ సూచించారు. ఈ సందర్భంగా పరస్పరం తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. దాఖలైన టెండర్లను బుధవారం పరిశీలించనున్నారు.

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించండి

- ఎంపీపీ స్థలానికే దిక్కు లేదు
- ఫేక్ డాక్యుమెంట్లపై ఐజీకి ఫిర్యాదు
- కొత్తపల్లె పంచాయతీలో విచ్చలవిడిగా భూ కబ్జాలు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్దేశ పూర్వకంగా తమపై విమర్శలు చేసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తమ పార్టీ అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా భూ ఆక్రమణలను, కబ్జాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆయన మంగళవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎంపీపీ శేఖర్ యాదవ్‌పై సోమవారం రాత్రి టీడీపీ వర్గీయులు దాడి చేశారన్నారు. సోమవారం రాత్రి ఎంపీపీ స్థలంలోని నిర్మాణాలను కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి అనుచరులు, టీడీపీ కౌన్సిలర్ మునీర్ జేసీబీతో పడగొట్టారన్నారు. గత కొద్ది రోజులుగా ఈ స్థలం తనదని శేఖర్ వద్దకు మునీర్ రాగా ఆయన నిజం నిగ్గు తేల్చాలని పోలీస్ స్టేషన్‌కు దాదాపు 10 మార్లు తిరిగారన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వర్గీయులు కావడంతో పోలీసులు అధికార పార్టీకి తలొగ్గి నిజాలను బయటికి వెల్లడించలేదన్నారు. వాస్తవానికి రూ.500 స్టాంప్ పేపర్‌పై టీడీపీ వర్గీయులు చూపించిన డాక్యుమెంట్‌కు సంబంధించిన సర్వే నంబర్ 547 ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరం గ్రామ పొలానికి సంబంధించిందన్నారు. ఈ ఆధారాలు కూడా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో లేవని, కేవలం దొంగ సంతకాలు, సీళ్లు వేసి తయారు చేసిన వాటిని చూపుతున్నారన్నారు. ప్రొద్దుటూరులో నకిలీ స్టాంప్‌లు, దొంగ సంతకాలు వ్యాపారం జోరుగా సాగుతోందని తెలిపారు.

కొత్తపల్లె గ్రామ పంచాయతీలో విచ్చల విడిగా కబ్జాలు

కొత్తపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్ శివచంద్రారెడ్డి ఎన్నికై నప్పటి నుంచి విచ్చల విడిగా భూ కబ్జాలు, ఆక్రమణలు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆరోపించారు. అధికార పార్టీ ప్రభావం కారణంగానే అక్కడ అవినీతి రాజ్యమేలుతోందన్నారు. ఒక ముఠా ఏర్పడి దొంగ సంతకాలు, నకిలీ స్టాంప్‌లు తయారు చేస్తోందన్నారు. ఈ విషయంపై విచారణ జరపాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీకి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ, సర్పంచ్ ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ లేకుండా పోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఎన్నో భూ ఆక్రమణలను, కబ్జాలు జరిగాయని తెలిపారు. అవినీతి విచ్చల విడిగా పెరిగిపోయిందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్, ఉప సర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, ఎంపీటీసీ ఓబయ్య యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివ పాల్గొన్నారు.

డిప్లొమా ఫలితాలలో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ


డిప్లొమా ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన సీబీఐటీ విద్యార్థులు

చాపాడు : స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇటీవల విడుదల చేసిన డిప్లొమో ఫస్టియర్, సెకెండియర్ ఫోర్త్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు డిప్లమో హెచ్ఓడీ జే.రమేష్‌బాబు తెలిపారు. ఫస్టియర్ సీఎంఈలో ఎం.కళ్యాణి 98.30, ఎం.శ్రీవర్ని 94.20, బీఎస్.బీబీ ఖతీజా, పి.అజయ్‌కుమార్ 91.60, షేక్ బాబా రియాజ్ 90.90, సయ్యద్ లిక్తియా 90,50, ఈసీఈలో కె.పూర్ణ అక్షయ 98.27, ఎం.ఉషశ్రీ 94.72, బి.వెంకట అనూష 90.90, పి.లక్ష్మి సుజన 95.72, ఎస్.భవిత 94.54, పి.ఆదికేశవరెడ్డి 94.54, ఎస్కే సనాఅఫీఫా 93.90 శాతం మార్కులు సాధించారన్నారు. ఈఈఈలో షేక్. మహమ్మద్ జుబేర్ 95.70, బి.మహ్మద్ యాసిన్ 86 శాతం మార్కులు సాధించగా, సెకెండియర్ సీఎంఈలో జి.కీర్తితేజ 98.88, ఎం.వెంకటలక్ష్మి 95.44, జి.చంద్రిక 95.22, పి.గంగశ్రీజన 97.11, పి.స్నేహ 95.55, పి.అంజనీదేవి 93.77, ఈసీఈలో బి.లాస్య 98.90, కె.వెంకటస్వప్న 97.90, కె.జాహ్నవి 97.10, కె.మెహజాబి 98.90. పి.రమ్యశ్రీ 97.50, ఎన్.గురుశ్రావ్య పూజిత 95.80, ఎస్.రహిమున్నీసా 95.80, ఈఈఈలో సి.మునికుమార్ 97.60, ఆర్.దినేష్‌రెడ్డి 96.00, ఎస్.లోకేష్ 92.30 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. తమ కాలేజీ విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల కరస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, సీఈఓ వి.లోహిత్‌రెడ్డి, డైరెక్టర్ అడ్మిన్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శృతి, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లో కడప జట్టు ఘన విజయం


5 వికెట్లు తీసిన కడప బౌలర్ నాగ కుల్లాయప్ప


4 వికెట్లు తీసిన కడప బౌలర్ చరణ్


106 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ మన్విత్‌రెడ్డి


170 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ తోషిత్ యాదవ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లో మంగళవారం మూడో రోజు కడప జట్టు చిత్తూరు జట్టుపై ఘన విజయం సాధించింది. కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో రెండు వికెట్లు కోల్పోయి 12 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 30.4 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసింది. దీంతో 329 పరుగులతో కడప జట్టు ఘన విజయం సాధించింది. చిత్తూరు జట్టులోని సోహన్‌రెడ్డి 47, సాయి చరణ్ 30 పరుగులు చేశారు. కడప జట్టులోని నాగకుల్లాయప్ప 5 వికెట్లు, చరణ్ 4 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 399 పరుగులు చేయగా చిత్తూరు 97 పరుగులకు ఆలౌట్ అయింది. కడప జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 169 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

డ్రాగా ముగిసిన నెల్లూరు-కర్నూలు మ్యాచ్

వైఎస్ఆర్ఆర్ స్టేడియంలో జరిగిన నెల్లూరు-కర్నూలు మ్యాచ్ డ్రాగా ముగిసింది. మంగళవారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 78.2 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 415 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని తోషిత్ యాదవ్ 155 బంతుల్లో 170 పరుగులు, మన్విత్‌రెడ్డి 106 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని నౌషన్ కళ్యాణ్ 3 వికెట్లు, మల్లికార్జున 2 వికెట్లు, విఖ్యాత్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 9 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 464 పరుగులు చేయగా కర్నూలు జట్టు 171 పరుగులకు ఆలౌట్ అయిన విషయం తెలిసిందే.

అనుమతి లేని వైద్యం

- స్పెషలైజేషన్' లేకున్నా 'రుమటాలజీ' వైద్యం
- ఓ ఆర్థో వైద్యురాలి నిర్వాకం

కడప రూరల్ : వైద్య వృత్తి పవిత్రమైంది. వారు దైవంతో సమానం. అయితే కొంతమంది వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తూ వృత్తికే కలంకం తెస్తున్నారు. కడప నగరం ఎర్రముక్కపల్లెలో ఒక ఆర్థోపెడిక్ వైద్యురాలు వైద్య నిబంధనలకు విరుద్ధంగా 'రుమటాలజీ' (కీళ్ల విభాగం) వైద్య సేవలు అందించడం చర్చనీయాంశంగా మారింది.

'స్పెషలైజేషన్' లేకుండానే..

వైద్య వృత్తి కోర్స్ (ఎంబీబీఎస్) ఐదేళ్ల పాటు ఉంటుంది. అనంతరం వైద్య రంగానికి సంబంధించి ఏదైనా ప్రత్యేక విభాగాలకు చికిత్స అందించాలంటే మరో మూడేళ్ల పాటు ప్రత్యేక కోర్సును అభ్యసించాలి. ఆ కోర్సు పూర్తయిన వారికి 'స్పెషలైజేషన్' సర్టిఫికెట్ ఇస్తారు. నిబంధనల మేరకు ఈ సర్టిఫికెట్ పొందిన వారు ఆయా విభాగాలకు సంబంధించి స్పెషలిస్ట్ వైద్యులుగా ప్రకటించుకోవచ్చు. ఆ విభాగానికి వైద్య సేవలు అందించవచ్చు. అయితే ఆ వైద్యురాలు రుమటాలజీలో 'స్పెషలైజేషన్' సర్టిఫికెట్ పొందలేదు. అయితే నిబంధనలకు విరుద్ధంగా 'అడ్వాన్స్ రుమటాలజీ అండ్ ఆర్థో ఆసుపత్రి' అని బోర్డు పెట్టారు. రుమటాలజీ విభాగానికి సంబంధించి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ అంశంపై ఎవరో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం..

బోర్డును మార్చమని చెప్పాం: డీఎంహెచ్ఓ

ఈ అంశం గురించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజును వివరణ కోరగా ఆయన స్పందించారు. ఆ వైద్యురాలికి రూమటాలజీలో 'స్పెషలైజేషన్' లేదు. నేమ్ బోర్డ్‌ను మార్చు చేసి సాధారణ వైద్య సేవలు అందించమని చెప్పాం. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపాం' అని అన్నారు.

మారని నేమ్ బోర్డు..

డీఎంహెచ్ఓ చెప్పిన దాని ప్రకారం అయితే నేమ్ బోర్డు మారాలి. అయితే సోమవారం సాయంత్రం వరకు నేమ్ బోర్డ్‌లో ఎలాంటి మార్పు లేదు. కాగా ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోనే ఉంటాయి. ఈ ఆసుపత్రులను తనఖీలు చేపట్టి ధ్రువీకరణ, అనుమతి పత్రాలను ఆ శాఖే చూడాలి. ప్రైవేటు ఆసుపత్రులను పర్యవేక్షించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.